PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :192 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం 02.08.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




# భద్రాచలం వద్ద.. గోదావరి ఉధృతి

## మూడో ప్రమాద హెచ్చరిక అమలు

నీటిమట్టం 56.10 అడుగులు .. 15.97 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం
లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక .. అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు





భద్రాచలం, ఆగస్టు 1(ప్రభాత సూర్యుడు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం మధ్యాహ్నం 12 గంటల నాటికి గోదావరి నీటిమట్టం 56.10 అడుగులకు చేరుకోగా, నదిలో 15,96,899 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. నీటిమట్టం 53 అడుగులు దాటడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43 అడుగులు కాగా, ఆ సమయంలో 9,32,288 క్యూసెక్కుల ప్రవాహం ఉంటుంది. రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి 48 అడుగులు, ప్రవాహం 11,44,645 క్యూసెక్కులు. ప్రస్తుతం నీటిమట్టం 56.10 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నమోదవుతున్న 15.97 లక్షల క్యూసెక్కుల ప్రవాహం మూడో హెచ్చరిక స్థాయి వద్ద నమోదయ్యే 14,26,684 క్యూసెక్కుల కంటే అధికంగా ఉంది.

### 1986లో చారిత్రక రికార్డు..

వరద ఉధృతి నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు నది ఒడ్డుకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారు.
భద్రాచలం వద్ద గతంలో నమోదైన వరద రికార్డులను పరిశీలిస్తే, 1986లో అత్యధికంగా 75.60 అడుగుల నీటిమట్టంతో 27.02 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదై చారిత్రక రికార్డుగా నిలిచింది. ఇటీవల కాలంలో 2022లో 71.30 అడుగుల నీటిమట్టంతో 24.43 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. ప్రస్తుతం నీటిమట్టం ఆ రికార్డులకు దూరంలో ఉన్నప్పటికీ, గోదావరి ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున వరద ప్రవాహంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరిస్థితిని బట్టి హెచ్చరికలు, సహాయక చర్యలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.



# లష్కర్ సంబురం

- ఉజ్జయిని అమ్మవారి ఉత్సవాలకు సిద్ధం
- తొలి రోజు మహంకాళికి సమర్పించనున్న బోనాలు
- రెండో రోజు భవిష్యవాణి రంగం, గజవాహన ఊరేగింపు
- భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 175 ప్రత్యేక బస్సులు

భాగ్యనగరంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల ఉత్సవాలు ఆదివారం నుంచి రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. లష్కర్ బోనాల ప్రధాన వేడుకలకు ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. వేడుకల తొలిరోజైన ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించనుండగా, సోమవారం ఉదయం వేడుకల్లో అత్యంత కీలకమైన భవిష్యవాణి 'రంగం' కార్యక్రమంతో పాటు సాయంత్రం కంటిపాపలా కాపాడే అమ్మవారి 'గజవాహన ఊరేగింపు' వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం తెల్లవారుజామున ప్రారంభమయ్యే వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ తరపున మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాత సూర్యుడు

### ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు



ఈ వైభవంగా జరిగే లష్కర్ బోనాల ఉత్సవాలకు రాష్ట్ర నలు మూలల నుంచి విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ దేవాలయ ప్రాంగణానికి చేరుకోవడానికి వీలుగా 175 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ వెల్లడించారు. ఎంజీబీఎస్, కాచిగూడ రైల్వే స్టేషన్, జేబీఎస్, చార్మినార్, బాలాజీనగర్, నాంపల్లి, రిసాల్ బజార్, వెంకటాపురం, ఓల్డ్ అల్వాల్, మెహిదీపట్నం, కుషాయిగూడ, చర్లపల్లి, హకీంపేట, ఓల్డ్ బోయిన్‌పల్లి, సైనిక్‌పురి, సనత్‌నగర్, జామై ఉస్మానియా, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, బోరబండ, పటాన్‌చెరు తదితర కీలక ప్రాంతాల నుంచి నేరుగా సికింద్రాబాద్‌కు ఈ ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగిస్తాయి. భక్తులకు మార్గదర్శనం చేసేందుకు, ప్రయాణ సౌకర్యాలను పర్యవేక్షించేందుకు ఆర్టీసీ ప్రత్యేక హెల్ప్ డెస్కులను కూడా అందుబాటులోకి తెచ్చింది.

# తెలంగాణ రైజింగ్..

## కొత్త శిఖరాలకు రాష్ట్రం: రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 1(ప్రభాత సూర్యుడు తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం సంబంధిత స్క్రీన్ షాట్‌ను ఎక్స్‌లో షేర్ చేశారాయన. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.



# ముంపు ప్రభావిత కుటుంబాలకు మంత్రి సీతక్క చేయూత

**నిత్యావసర సరుకులు, దుప్పట్ల పంపిణీ**



ములుగు ఆగస్టు 01 ప్రభాత సూర్యుడు ములుగు జిల్లా వాజేడు మండలంలోని దూలాపురం గ్రామంలో ముంపు ప్రభావానికి గురయ్యే కుటుంబాలకు రాష్ట్ర మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క అండగా నిలిచారు. గ్రామంలో ముంపు పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న 7 కుటుంబాలను గుర్తించి, వారికి నిత్యావసర సరుకులు, దుప్పట్లను మంత్రి సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు.



ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముంపు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.ముంపు ప్రభావిత కుటుంబాలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, దుప్పట్లు తదితర సహాయక సామగ్రిని అందించడం ద్వారా వారికి తక్షణ ఉపశమనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, నదులు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని మంత్రి సీతక్క సూచించారు. ముంపు పరిస్థితులు ఏర్పడినప్పుడు అధికారులు సూచించే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# సదరం యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి

**అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు**
**కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



ములుగు ఆగస్టు 01 ప్రభాత సూర్యుడుసెర్ప్ సీఈఓ దివ్య సదరం యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు , అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి పాల్గొన్నారు. సదరం యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌళిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వం సదరం యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.



తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సకాలంలో సదరం యూడీఐడీ ధృవ పత్రాలు జారీకి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఆర్ డి ఓ రవీందర్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర శేఖర్, విద్యా శాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఫోటోగ్రాఫర్ చెన్నం రాజుకు మంత్రి సీతక్క పరామర్శ

**రూ.20 వేల ఆర్థిక సాయం**
**ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు చర్యలకు హామీ**

ములుగు ఆగస్టు 01 ప్రభాత సూర్యుడు ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన ఫోటోగ్రాఫర్ చెన్నం రాజును రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరామర్శించారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి, ప్రమాదానికి సంబంధించిన వివరాలను చెన్నం రాజును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అగ్నిప్రమాదం వల్ల ఇల్లు, ఇంట్లోని సామాగ్రి దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన చెన్నం రాజుకు మంత్రి సీతక్క గారు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఆపద సమయంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. తక్షణ సహాయంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.



అదేవిధంగా బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించే దిశగా ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చూస్తామని పేర్కొన్నారు.అదనంగా, చెన్నం రాజుకు అవసరమైన నిత్యావసర సామాగ్రి కార్పొరేషన్ ద్వారా రుణం (లోన్) మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సహకారం అందిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం తిరిగి సాధారణ జీవనం కొనసాగించేలా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి సీతక్క**

అగ్నిప్రమాదం వంటి దురదృష్టకర ఘటనలతో నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి సీతక్క గారు తెలిపారు. బాధితులకు అవసరమైన ఆర్థిక, గృహ, నిత్యావసర సహాయాలు అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పీర్ల కృష్ణా బాబు తదితరులు పాల్గొన్నారు.

# సదరం--యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి...జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.

**అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం--యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు.**

ఖమ్మం, ఆగస్టు 1 ప్రభాత సూర్యుడు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-- యూడీఐడీ కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం సెర్ప్ సీఈఓ దివ్య సదరం-- యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.సదరం--యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న



దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌళిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లాకలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం సదరం-- యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-- యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన సదరం కేంద్రం వల్ల ప్రక్రియ మరింత క్రమబద్ధీకరించ బడిందని కలెక్టర్ తెలిపారు.

# జైల్ భరో ను జయప్రదం చేయండి.

సింగరేణి ఆగస్టు 01 ప్రభాత సూర్యుడుకార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఆగస్టు 10న జరగనున్న జైల్ భరో ను జయప్రదం చేయాలని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర పిలుపునిచ్చారు సింగరేణి మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ మండల కార్యదర్శి అనగా రాంబాబు అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టే విధంగా ప్రజా ఉద్యమాలు జరగాలని అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో కార్మికులు, రైతులు,వ్యవసాయ కార్మికులు కు ఎంతో నష్టం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను



రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని అప్పుడే కార్మికుల హక్కులు కాపాడబడతాయని ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను కార్పోరేట్ల దోపిడీకి కార్మికులను గురి చేయడం దుర్మార్గమని ఇది ప్రజా ప్రభుత్వం కాదని భారత రాజ్యాంగాన్ని అనుసరించి పాలించే చట్టబద్ధ ప్రభుత్వం కాదని విమర్శించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేరు మార్చి 125 పని దినాలనే పేరుతో 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు అనే పేరుతో ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చి ప్రజల ఉపాధిని దెబ్బతీస్తున్నదని దీనిలో భాగంగా ఎస్సీ ఎస్టీ బీసీ ఇతర పేదలు తీవ్రంగా నష్టపోతారని విమర్శించారు. రైతు నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతులు నడ్డి విరిచి వారి పోరాటానికి బెదిరిపోయి క్షమాపణలు చెప్పి నల్ల చట్టాలు రద్దు చేస్తూ చెప్పిన కనీస మద్దతు ధర చట్టం ఇంతవరకు చేయలేదని ఇది రైతులను మోసం చేయడమేనని అది కాకుండా కొత్తగా రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రీఛార్జ్ రూపంలో నీరు వాడుకొని రైతులపై పన్ను భారాలు వేయడానికి విద్యుత్ చట్టాన్ని తెస్తున్నదని ఇది ముమ్మాటికి రైతు నల్ల చట్టాల అమలులో భాగమేనని,ఈ కారణంగా పేదలకు అందుతున్న ఉచిత విద్యుత్తు మృగ్యమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం విషయంలో న్యాయ పోరాటం చేస్తామనడం విద్యుత్ చట్టం అమలుకు కేంద్రంపై పోరాడకుండా కొత్త డిస్కములు ఏర్పాటు చేయడం వంటి చర్యలు కేంద్ర ప్రభుత్వానికి సాగిలపడినని విమర్శించారు.ఈ సమస్యల వల్ల భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆ విధానాలను వెనుకకు తీసుకునే విధంగా ఆగస్టు 10న జరగనున్న జైలు భరో కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కే నరేంద్ర పిలుపునిచ్చారు .

# అంగన్వాడీలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.

**తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన.**



సింగరేణి ఆగస్టు 01 ప్రభాత సూర్యుడుప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సింగరేణి మండల పరిధిలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వివిధ సెక్టార్లో ప్రపంచం తల్లిపాల వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా వెంకటీయ్య తండాలో ఉన్న గిద్దవారిగూడెం టు అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఘనంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ జర్పుల శాంతి గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించడం ఎంతో అవసరమని, పుట్టిన తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు. తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. తల్లిపాలు శిశువుకు తొలి ఆహారం, తొలి టీకా, ప్రకృతి ప్రసాదించిన అమృతమని పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా తల్లులు తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని, శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి తల్లి తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని శాంతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# బోగత జలపాతాన్ని సందర్శించిన రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క

**పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి అనుమతి ఉన్న ప్రాంతాల్లోనే సందర్శించాలి: మంత్రి సీతక్క**



ములుగు ఆగస్టు 01 (ప్రభాత సూర్యుడు) ములుగు జిల్లా వాజేడు మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బోగత జలపాతాన్ని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జలపాతం పరిసర ప్రాంతాలను పరిశీలించిన మంత్రి, పర్యాటకుల భద్రతకు సంబంధించిన అంశాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వర్షాకాలంలో జలపాతాలు, వాగులు, సెలయేళ్ల వద్ద నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నందున పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చే సందర్శకులు తమ భద్రతను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అధికారులు అనుమతించిన, భద్రతా పరంగా సురక్షితమైన ప్రాంతాల్లో మాత్రమే పర్యాటకులు సందర్శించాలని మంత్రి సూచించారు. అడవుల్లోని అనుమతి లేని ఇతర జలపాతాలు, వాగులు, సెలయేళ్ల వద్దకు వెళ్లి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో అడవుల్లోని వాగులు, జలపాతాల వద్ద నీటి ప్రవాహం, ప్రవాహ వేగం ఎప్పుడు పెరుగుతుందో అంచనా వేయడం కష్టమని, ముఖ్యంగా యువత అత్యుత్సాహానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అధికారులు ఏర్పాటు చేసిన సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యత**

బోగత జలపాతం ములుగు జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సందర్శకులకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి సూచించారు. .

పర్యాటకుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,

ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అధికారుల సూచనలు పాటించాలని మంత్రి సీతక్క పర్యాటకులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు... అదనపు సమయాన్ని నాణ్యత పెంపునకు వినియోగించాలి - భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్

### ఎస్ఐఆర్ అమలుపై రంగారెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష

### జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం -- అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన









రంగారెడ్డి ఆగష్టు 1 ప్రభాత సూర్యుడు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశానికి హాజరైన భారత ఎన్నికల సంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ, ఇప్పటి వరకు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు. ప్రారంభంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే డిజిటైజేషన్ వేగం తక్కువగా ఉండటంతో పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం అదనంగా ఏడు రోజుల గడువు కల్పించిన నేపథ్యంలో, ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫోటోలు, పత్రాల అప్‌లోడ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను ధృవీకరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్న చోట వాటినే పోలింగ్ కేంద్రాలుగా వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను ఉపయోగించాలని స్పష్టం చేశారు. మరణించిన, చిరునామా మార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబ సభ్యులు, స్థానిక సమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో వచ్చే అభ్యంతరాలు, నోటీసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు గుర్తించలేకపోతున్నామని, బీఎల్‌వోలు అందుబాటులో లేరనే ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి వస్తున్నాయని పేర్కొంటూ, అలాంటి సందర్భాల్లో బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ అవసరమైన దరఖాస్తులు స్వీకరించి ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,056 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. శేరిలింగంపల్లి, ఎల్.బీ.నగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి పట్టణ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో మ్యాపింగ్ ప్రక్రియ సవాలుగా మారిందన్నారు. కొన్ని గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో ప్రత్యేక సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, గ్రామీణ నియోజకవర్గాల్లో మంచి పురోగతి నమోదవుతుండగా, పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, అనామలీస్, డూప్లికేట్, నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ అదనపు సమయాన్ని పూర్తిగా వినియోగించుకొని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పెండింగ్ కేసులను సంయుక్తంగా ధృవీకరించి, అవసరమైన చోట ఓటర్లను నేరుగా సంప్రదించి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో ఇప్పటికే విస్తృత సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని, మరోసారి ఈఆర్‌వో స్థాయిలో సమావేశాలు నిర్వహించి మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సాధ్యమైనంత వరకు అదే కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని, ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం నుంచి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నమోదయ్యేలా అత్యున్నత నాణ్యతతో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, అదనపు కలెక్టర్ కె. కిరణ్మయితో కలిసి కొంగర, బొంగులూరు, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, ప్రజల స్పందన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈఆర్‌వోలు, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాల పరిశీలన మంత్రి సీతక్క

### 28 కుటుంబాలు 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలింపు

### ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు హామీ





ములుగు ఆగస్టు 01, (ప్రభాత సూర్యుడు)ములుగు జిల్లాలో శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి మంగపేట లో గోదావరి వరద ప్రవాహాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నందున, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులను పరామర్శించిన మంత్రి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్ తోట రవీందర్ స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరదలు సాధారణ స్థితికి వచ్చేవరకు పునరావాస కేంద్రాల్లోనే ముంపు బాధితులు తల దాచుకోవాలి

### పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన భోజనంతో పాటు పారిశుధ్యం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రోణాల్ శ్రేష్ట

దుమ్ముగూడెం ఆగస్టు 01 ప్రభాత సూర్యుడుగోదావరి వరద తాకిడికి గురి అయిన ముంపు గ్రామాల కుటుంబాల ప్రజలకు పునరావాస కేంద్రాలలో నాణ్యమైన ఆహారంతో పాటు వారి ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. శనివారం దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో ముంపుకు గురైన డబుల్ బెడ్ రూమ్ కాలనీ, ప్రగల్ల పల్లెలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలో ఉంటున్న ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు.



ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తూ ఆరోగ్య పరిరక్షణ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వరద పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితి ఏర్పడే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని ప్రజలకు భరోసా కల్పించారు. అనంతరం పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులతో ఆయన మాట్లాడుతూ వరదలు పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి వచ్చేవరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని, ఆరోగ్యపరంగా భోజనం విషయంలో శానిటేషన్ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. వరదల సమయంలో పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పునరావాస కేంద్రంలో ఉండే ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలని అలాగే ఎవరైనా గర్భిణీ స్త్రీలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్సీకి తరలించి డెలివరీ అయ్యే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం తాసిల్దార్ అశోక్ కుమార్ ఎంపీడీవో వివేక్ రామ్ ఎంపీఓ వీరారెడ్డి ఆర్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం మండల విద్యాశాఖ అధికారిగా బెక్కంటి. శ్రీనివాసరావు

భద్రాచలం ఆగస్టు 01 ప్రభాత సూర్యుడు. భద్రాచలం మండల విద్యాశాఖ అధికారిగా ఎస్ ఎన్ ఎ ఎం, జడ్పీహెచ్ఎస్ ,నర్సాపురం ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు నియామకం పట్ల పి .ఆర్ .టి. యు .టి యస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కారంపూడి. దశమ్ బాబు , దుమ్మగూడెం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి. శ్రీనివాసరావు బి. మల్లికార్జునరావు, జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పి. నరసయ్య, సిహెచ్. ప్రభాకర్ రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బి. భాస్కర్ గార్లు హర్షం వ్యక్తం చేశారు.





# రశ్మికకు గాయం.. అప్పటి వరకు రెస్ట్

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్ అనే తేడా లేకుండా వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. నేషనల్ క్రష్ రశ్మిక మందన్న ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్ అనే తేడా లేకుండా వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. అయితే రీసెంట్‌గా ఆమె ఒక సినిమా షూటింగ్‌లో గాయపడినట్లు తెలుస్తోంది. ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో రశ్మికకు ఈ గాయం అయినట్లు సమాచారం. అన్ని సినిమాల షూటింగ్స్ ఫుల్ స్వింగ్ లో ఉన్నప్పుడు రశ్మికకు ఇలా కావడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. గత కొద్ది రోజులుగా రశ్మిక 4 'రణబాలి', 'మైసా' సినిమాల షూటింగ్స్‌లో కంటిన్యూస్‌గా పాల్గొంటున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల్లోనూ బ్యాక్ టు బ్యాక్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హెవీ డ్యాన్స్ పర్ఫార్మెన్స్‌లు చేయడం వల్ల ఈ గాయం అయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రశ్మిక హిప్ ఏరియాలో 'టెండన్ డిటాచ్‌మెంట్' అయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అలాగే ఆమెకు తీవ్రమైన నొప్పి వచ్చినట్లు సమాచారం. అయితే ఇలాంటి గాయాలు నిత్యం కఠినమైన శిక్షణ తీసుకునే ప్రొఫెషనల్ అథ్లెట్స్ లేదా స్పోర్ట్స్ పర్సన్స్‌కే అవుతుంటాయని వైద్యులు చెబుతున్నారు. ఒక నటికి ఈ స్థాయిలో టెండన్ డిటాచ్‌మెంట్ అవ్వడం చూస్తే ఆమె హార్డ్ వర్క్ ఏ స్థాయిలో ఉందో చెప్పవచ్చు. ఈ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి రశ్మికకు కనీసం ఆరు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. రెస్ట్ మాత్రమే కాకుండా, దెబ్బతిన్న టెండన్ మళ్లీ సాధారణ స్థితికి వచ్చి బలం పుంజుకోవడానికి ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ కూడా తప్పనిసరి అని డాక్టర్లు స్పష్టం చేశారనీ తెలుస్తోంది. దీంతో ఆమె కొంతకాలం షూటింగ్స్‌కు దూరంగా ఉండనున్నారు. ప్రస్తుతం పాన్ ఇండియా మార్కెట్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఉన్న రశ్మిక చేతిలో నాలుగు భారీ బడ్జెట్ సినిమాలు ఉన్నాయి. అలాగే దాదాపు 30కి పైగా ప్రముఖ బ్రాండ్స్‌కు ఆమె అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు డాక్టర్లు ఆరు వారాల రెస్ట్ చెప్పడంతో, ఆమెకు సంబంధించిన సినిమా షెడ్యూల్స్‌తో పాటు పలు కమర్షియల్ యాడ్స్ షూటింగ్స్ కూడా తాత్కాలికంగా బ్రేక్ పడనున్నాయి. దీంతో ఆమెకు సంబంధించిన షూటింగ్స్ తాత్కాలికంగా నిలిచిపోయే అవకాశం ఉంది. కెరీర్‌లో బిజీగా ఉన్న సమయంలో రశ్మికకు ఈ గాయం కావడంతో ఆమె సినిమాలు, ప్రకటనల షూటింగ్స్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. రశ్మిక త్వరగా ఈ గాయం నుంచి కోలుకుని మళ్లీ సెట్స్‌లో అడుగుపెట్టాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.



# పూజాహెగ్డే పెళ్లికి గ్రీన్ సిగ్నెల్!



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు గ్లామర్‌తో నటనతో అలరించిన నటి పూజాహెగ్డే వ్యక్తిగత జీవితానికి సంబం ధించిన ఓ ఆసక్తికర వార్త వైరల్ అవుతోంది. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు గ్లామర్‌తో నటనతో అలరించిన నటి పూజాహెగ్డే వ్యక్తిగత జీవితానికి సంబం ధించిన ఓ ఆసక్తికర వార్త వైరల్ అవుతోంది. తాజాగా అమ్మడు వివాహం గురించి ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పూజాహెగ్డే పెళ్లికి గ్రీన్ సిగ్నెల్ ఇచ్చిందని.. త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతుందంటూ బాలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా పూజాహెగ్డేకు సరైన అవకాశాలు రాని సంగతి తెలిసిందే. దీంతో అమ్మడు కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పూజ తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లికి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇండస్ట్రీకి చెందినవారా ? వ్యాపార రంగం నుంచి ఎవరైనా వస్తారా? అనే దానిపై క్లారిటీ లేదు గానీ.. కుటుంబ సభ్యులు మాత్రం మంచి వరుడిని వెతికే పనిలో నిమగ్నమైనట్లు ప్రచారం జరుగుతోంది. పూజాహెగ్డే తల్లిదండ్రులు తగిన వరుడిని అన్వేషిస్తున్నారని.. త్వరలోనే ఈ విషయమై కుటుంబ సభ్యుల సమక్షంలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. నటిగా ఎన్నో విజయాలను అందుకున్న పూజాహెగ్డే ఇప్పుడు జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకోవడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పూజాహెగ్డే ప్రేమ వ్యవహారాలకు సంబంధించి పలుహ్వార్లు రూమర్స్ వినిపించినప్పటికీ వాటిని ధృవీకరించలేదు. కెరీర్ పట్ల పూర్తి ఏకాగ్రత పెట్టిన అమ్మడు ఇప్పుడు కుటుంబం కోరిక మేరకు వివాహానికి సిద్ధమవ్వడం విశేషం. వివాహం తర్వాత కూడా సినిమాలు కొనసాగిస్తారా లేదా అనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రస్తుతం పెళ్లి వార్త నెట్టింట మార్మోగిపోతోంది. గ్లామరస్ హీరోయిన్‌గా టాలీవుడ్, బాలీవుడ్‌లలో స్టార్ హీరోల సరసన నటించిన పూజాహెగ్డే అందచందాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు అలాంటి అగ్ర నటి పెళ్లి పీటలెక్కబోతుందనే వార్త తెలియగానే ఆమె అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పూజాహెగ్డే జీవితంలో నూతన అధ్యాయం సుఖసంతోషాలతో సాగాలని కోరుకుంటున్నారు. ఇక పూజాహెగ్డే సినిమాల విషయానికి వస్తే ఇటీవలే -జన నాయగన్- సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. సరైన అవకాశాలు రాక ఇబ్బంది పడుతోన్న సమయంలో -జన నాయగన్- విజయంతో బౌన్స్ బ్యాక్ అవ్వాలనుకుంది. కానీ ఆ సినిమా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. బాక్సాఫీస్ వద్ద రొటీన్ చిత్రంగానే తేలిపోయింది. ప్రస్తుతం తెలుగులో ఓ రెండు సినిమాలకు సైన్ చేసింది. దీంతో వాటిపైన ఆశలన్నీ.

# 'రామాయణ' ఎఫెక్ట్..
# 'టాక్సిక్'పై పెరిగిన అంచనాలు..!



రాకింగ్ స్టార్ యష్ ప్రస్తుతం 'టాక్సిక్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. అయితే, ఈ సినిమాలోని బోల్డ్ కంటెంట్ కారణంగా అభిమానుల్లో ఈ మూవీపై కాస్త ఆందోళన ఏర్పడింది. చిత్ర ప్రమోషనల్ కంటెంట్ చూసి వారు ఆందోళనకు గురయ్యారు. కానీ, ఇప్పుడు ఒక్కసారిగా యష్ పై వారికి పూర్తి కాన్ఫిడెన్స్ ఏర్పడింది. ఇటీవల విడుదలైన 'రామాయణ' ట్రైలర్‌లో రాకింగ్ స్టార్ యష్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. రావణాసురుడిగా ఆయన పవర్‌ఫుల్ లుక్, నటన ప్రేక్షకులకు బాగా నచ్చాయి. ట్రైలర్ చూసిన వాళ్లంతా ఆయన గురించే మాట్లాడుకుంటున్నారు. ఈ పాజిటివ్ టాక్ 'టాక్సిక్'కి బాగా ప్లస్ కానుంది. ఆగస్టు 26న రాబోతున్న ఈ సినిమా లేట్ అవ్వడం వల్ల, ముఖ్యంగా హిందీలో పెద్ద అంచనాలు లేకుండా పోయాయి. కానీ రామాయణ ట్రైలర్‌తో యష్‌పై ఉన్న క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో ఆయన నటించే 'టాక్సిక్' సినిమాపై కూడా అందరిలోనూ ఆసక్తి మొదలైందని సినిమా విశ్లేషకులు చెబుతున్నారు.

# మల్టీప్లెక్స్ బిజినెస్ లోకి ఎన్టీఆర్..
# కేవలం పుకార్లు మాత్రమే..?

టాలీవుడ్ స్టార్ హీరోలు మహేష్ బాబు, అల్లు అర్జున్, రవితేజ, విజయ్ దేవరకొండ మల్టీప్లెక్స్ వ్యాపారంలో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఎన్టీఆర్ కూడా హైదరాబాద్ లో మల్టీప్లెక్స్ నిర్మిస్తున్నారంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఇందులో ఎలాంటి నిజం లేదు. ఎన్టీఆర్ ప్రస్తుతం ఎలాంటి వ్యాపారాల్లోనూ పెట్టుబడి పెట్టే ఆలోచనలో లేరని తేలింది. ప్రస్తుతం ఎన్టీఆర్ దృష్టి అంతా సినిమాలపైనే ఉంది. ఆయన ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవల షూటింగ్‌లో గాయపడటంతో ఆయన ఆరు వారాల విశ్రాంతిలో ఉన్నారు. 2027 జూన్‌లో రానున్న ఈ చిత్రం పూర్తయ్యాక, త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కే భారీ పౌరాణిక చిత్రంలో ఎన్టీఆర్ నటించనున్నారు.



# రేణు దేశాయ్ అసలైన సెకండ్ ఇన్నింగ్స్!




ఒకానొక దశలో నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రేణు దేశాయ్ చాలా కాలం పాటు నటనకు దూరంగా ఉంటూ దర్శకత్వం ..సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. ఒకానొక దశలో నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రేణు దేశాయ్ చాలా కాలం పాటు నటనకు దూరంగా ఉంటూ దర్శకత్వం ..సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. మాస్ మహారాజా రవితేజ -టైగర్ నాగేశ్వరరావు- చిత్రంతో వెండితెరకు రీఎంట్రీ ఇచ్చినప్పటికీ ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆ పునరాగమనం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. అయితే నటనపై ఉన్న మక్కువను ఏమాత్రం తగ్గించుకోని రేణు మొక్కుబడి పాత్రలతో కాకుండా తనలోని అసలైన నటిని పరిచయం చేసే బలమైన పాత్రల కోసం ఎదురు చూశారు. రొటీన్ కమర్షియల్ హంగులకు దూరంగా, నటనకు పూర్తి ఆస్కారం ఉన్న ఇంటెన్స్ అండ్ ఎమోషనల్ రోల్స్‌తోనే తన సెకండ్ ఇన్నింగ్స్‌ను గట్టిగా ప్లాన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రయోగాత్మక చిత్రాలకు, పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్స్‌కు విశేష స్పందన లభిస్తోంది.

ఈ నేపథ్యంలో రేణు దేశాయ్ ఎంచుకున్న తదుపరి ప్రాజెక్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న ప్రతిష్టాత్మక -ఓం- చిత్రంలో ఒక కీలక పాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందులో ఏకంగా లెజెండరీ నటుడు మమ్ముట్టికి జోడీగా ఆమె నటిస్తుండటం విశేషం. పేరుకు మాత్రమే కాకుండా సినిమా కథనాన్ని మలుపు తిప్పే అత్యంత శక్తివంతమైన మరియు భావోద్వేగభరితమైన పాత్రలో ఆమె కనిపించనున్నారు. మమ్ముట్టి లాంటి దిగ్గజ నటుడి సరసన నటించడం సాధారణమైన విషయం కాదు. ఈ పాత్ర ద్వారా ఆమె తన నటనలోని మరో కోణాన్ని వెండితెరపై ఆవిష్కరించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. వయసుకు తగినట్లుగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన నటనకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగడం ఆమె పరిణతికి నిదర్శనం.

వ్యక్తిగతంగా ఎన్నో బాధ్యతలను నిర్వర్తిస్తూనే నటిగా కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టడానికి ఈ తరహా చిత్రాలు సరైన వేదికగా మారుతున్నాయి. ఇలాంటి గ్లోబల్ ప్రాజెక్ట్‌లతో పాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలను ఎంచుకోవడం ద్వారా రేణు దేశాయ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేసుకుంటున్నారు. ఈ సినిమాతో నటిగా మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరచడం ఖాయంగా కనిపిస్తోంది. సౌత్ సినిమాలలో అక్క, వదిన, లేదా బలమైన కుటుంబ నేపథ్యం ఉన్న పాత్రలకు ఎప్పుడూ మంచి డిమాండ్ ఉంటుంది. తెలుగు తెరపై అలాంటి పాత్రలకు తగిన నటీమణుల కొరత ఉన్న సమయంలో రేణు దేశాయ్ లాంటి మెచ్యూర్డ్ ఇమేజ్ ఉన్న నటి ఈ బాట పట్టడం సానుకూల పరిణామం. ఇలాంటి పవర్‌ఫుల్ అండ్ ఎమోషనల్ క్యారెక్టర్స్‌ను క్రమం తప్పకుండా ఎంచుకుంటే టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కట్టడం ఖాయం. కేవలం రీఎంట్రీ ఆర్టిస్ట్‌గా కాకుండా కథను మోసే కీలక నటిగా సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా నడిపించగల సామర్థ్యం కనబరుస్తున్నారు

# 'రామాయణం' లో ఒబెరాయ్ రోల్ ప్రాముఖ్యత?

దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక దృశ్య కావ్యం 'రామాయణం' చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక దృశ్య కావ్యం 'రామాయణం' చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో.. -రక్త చరిత్ర- ఫేమ్ వివేక్ ఓబెరాయ్ ఎలాంటి పాత్రలో నటిస్తున్నారు? అనే చర్చ ఆసక్తిని కలిగిస్తోంది. ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి అందులో ఒక బలమైన స్ఫురద్రూపం అందరి దృష్టిని ఆకర్షించింది. అది వివేక్ ఒబెరాయ్. అతడు ఈ ప్రతిష్మాత్మక చిత్రంలో ఒక కీలకమైన, శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. -రామాయణ- ఇతిహాసంలో ఎంతో విశిష్టత కలిగిన విద్యుజ్జిహ్వా అనే రాక్షస యోధుడి పాత్రలో ఆయన కనిపించనుండటం సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. పౌరాణిక మూలాల ప్రకారం... విద్యుజ్జిహ్వా కాలకేయ లేదా దానవ వంశానికి చెందిన అత్యంత పరాక్రమవంతుడైన రాక్షస వీరుడు. అంతేకాకుండా ఈ పాత్ర రావణాసురుడికి అత్యంత దగ్గరి బంధుత్వం కలిగి ఉంటుంది. రావణుడి చెల్లెలైన శూర్పణఖ భర్తే ఈ విద్యుజ్జిహ్వా. విద్యుజ్జిహ్వా అంటే -మెరుపు లాంటి నాలుక- అని అర్థం. యుద్ధరంగంలో కత్తిని మెరుపు వేగంతో తిప్పడంలో మాయా శక్తులు ఉపయోగించడంలో ఒక రూపం నుంచి ఇంకో రూపానికి మారడంలో ఈ మాయావి అయిన రాక్షసుడు అత్యంత సిద్ధహస్తుడు. అయితే శూర్పణఖను వివాహం చేసుకున్నప్పటికీ విద్యుజ్జిహ్వాకు రావణాసురుడికి మధ్య సత్సంబంధాలు ఉండేవి కావు. ఇద్దరి మధ్య అధికారం, ఆధిపత్య పోరు తీవ్రంగా ఉండేది. రావణాసురుడు తన దిగ్విజయ యాత్రలో భాగంగా దానవుల రాజ్యాన్ని జయించడానికి వెళ్లినప్పుడు విద్యుజ్జిహ్వా లొంగిపోవడానికి నిరాకరించి ఎదురుతిరుగుతాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య జరిగిన ఘోర యుద్ధంలో విద్యుజ్జిహ్వా ఓడిపోయి రావణాసురుడి చేతిలోనే దారుణంగా హతమవుతాడు. విద్యుజ్జిహ్వా మరణమే రామాయణంలో ఒకానొక అతిపెద్ద మలుపుకు ప్రధాన కారణమవుతుంది. సొంత భర్తను అన్నయైన రావణుడే చంపడంతో శూర్పణఖ మనసులో పగ, ప్రతీకార జ్వాలలు రగులుతాయి. ఆ పగ తీర్చుకోవడానికే శూర్పణఖ పంచవటి వద్ద శ్రీరాముడు, లక్ష్మణులతో వివాదానికి దిగి తదనంతర కాలంలో సీతాపహరణానికి .. లంకా దహనానికి పరోక్షంగా కారణమవుతుంది. ఈ రకంగా విద్యుజ్జిహ్వా పాత్ర రామాయణ కథా గమనంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ చిత్రంలో రావణాసురుడిగా కన్నడ రాకింగ్ స్టార్ 'యష్' నటిస్తుండగా, విద్యుజ్జిహ్వాగా వివేక్ ఓబెరాయ్ నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య వచ్చే తీవ్రమైన ఫేసాఫ్ ఘట్టాలు.. యుద్ధ సన్నివేశాలు వెండితెరపై ప్రేక్షకులకు గొప్ప విజువల్ ట్రీట్‌గా నిలవనున్నాయి. రావణుడి అంతర్గత శత్రుత్వాన్ని... శూర్పణఖ పగతో ఉన్న మూలాలను చూపించడంలో వివేక్ ఓబెరాయ్ పాత్ర నితీష్ తివారీ రామాయణంలో కీలకమైనదిగా మారనుంది. ట్రైలర్ లో ఖడ్గధారియై రణభూమిలో ఒక బ్లింక్ లాగా కనిపించాడు ఒబెరాయ్. అతడి పాత్ర ఎలా ఉండబోతోందో వేచి చూడాలి. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం, వచ్చే ఏడాది దీపావళికి రెండో భాగం విడుదల కానున్నాయి.



Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555